క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు మొక్కుబడిలో భాగంగా ఆలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదాం


మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు పి.సాయిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మన ప్రయత్నం చేయాలన్నారు. మొక్కలను నాటితే అవి పెరిగి పెద్దవైతే సకాలంలో వర్షాలు కురుస్తాయని, మంచి వాతావరణం ఉంటుందన్నారు. అనంతరం ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి


గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్

పెద్దకడబూరు: వర్షాకాల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ రామాంజనేయులు సూచించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి మహేంద్ర ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామంలో డయేరియా ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, నీరు కలుషితం కాకుండా చూడా లని సూచించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. హెల్త్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణ ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ (వామ్) విభాగ్ వారిచే అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే), చార్టెడ్ అకౌంటెంట్స్ దినోత్సవం (సీఏ డే) వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యులు దండల రంజిత్ కుమార్, డాక్టర్ సౌమ్య, ప్రకృతి వైద్యనిపుణులు సోమిశెట్టి కౌశిక్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ జేపీ రవిశంకర్‌లను సన్మానించారు. ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి సన్మానించడం జరిగిందని వామ్ కార్యదర్శి నాయకంటి రఘు, కోశాధికారి రంజిత్ తెలిపారు. డాక్టర్లు ప్రజలకు నిత్యం సేవలందిస్తూ ప్రాణాలను నిలబెడుతున్నారన్నారు. డాక్టర్ల సేవలు మరువలేనివని చెప్పారు. అలాగే చార్టెడ్ అకౌంటెంట్స్ దేశ ఆర్థిక ప్రగతిని కాపాడతారని, దేశం అభివృద్ధిలో భాగస్వాములు అవుతారని చెప్పారు. వారి సేవలు మరువలేనివని కొనియాడారు. వామ్ ఉపాధ్యక్షులు యాదగిరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

ఎమ్మిగనూరురూరల్: స్థానిక భాష్యం హైస్కూల్లో ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మనిషికి వైద్యం అందించి పునర్జన్మనిస్తారని అందుకే వైద్యో నారాయణ హరి అన్నారని చెప్పారు. కనిపెంచిన తల్లిదండ్రులు, గురువుల తరువాత ప్రతిఒక్కరూ డాక్టర్లను గౌరవించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో డాక్టర్లకు మొక్కలు అందజేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో చాంప్స్ ఇన్‌చార్జ్ అనురాధ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం

- వరి, మొక్కజొన్న, వేరుశనగకు ముఖ్యం
- పైర్లకు తెగుళ్లను నివారించే శక్తి
- అధిక దిగుబడులకు అవకాశం


మహ్మద్‌ఖాద్రి, వ్యవసాయశాఖ ఏడీఏ


విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎమ్మిగనూరు: పంటసాగులో విత్తనశుద్ధి కీలకం. మేలైన విత్తనాలను ఎంచుకుని తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేసి చీడపీడలు, తెగుళ్లను నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో మొత్తం 65 వేల హెక్టార్ల సాగుభూమి ఉంది. ఇందులో 55 వేల హెక్టార్లు వర్షాధారంతో, 10 వేల హెక్టార్లు నీటిపారుదల వనరుల కింద సాగవుతుంది. అక్కడక్కడ కురిసిన వర్షాలకు ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు 1500 ఎకరాల్లో మెట్టపంటలు సాగయ్యాయి. వరి, కొర్ర, సజ్జ, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి ఆహార పంటలతోపాటు వాణిజ్య పంటలైన పత్తి, వేరుశనగ, మిర్చి, ప్రొద్దుతిరుగుడు, ఆముదం పంటలను విస్తారంగా సాగు చేసేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రస్తుతం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్ర సామగ్రిని సబ్సిడీతో పంపిణీ చేస్తున్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా పొలంబడులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. దీంతో పంటల సాగుకు రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఖరీఫ్ సాగులో ముఖ్యంగా వేరుశనగ, వరి, మొక్కజొన్న, మిరప, పెసర, కందులు తదితర పంటల సాగుకు విత్తనశుద్ధి కీలకమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. విత్తనాలకు నేల నుంచి సంక్రమించే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విత్తనశుద్ధి ముఖ్యమని ఏడీఏ మహ్మద్‌ఖాద్రి తెలిపారు.

వివిధ పంటల్లో విత్తన శుద్ధి విధానం

పంటరకం	విత్తనశుద్ధి రసాయనాలు	కిలో విత్తనాలకు వాడాల్సిన కొలత
వరి	కార్బండిజమ్	1 గ్రాము
కందులు/మొక్కజొన్న	థైరమ్, కాప్టాక్	
పెసర/మినుము	మాంకోజెబ్	3 గ్రాములు
మిరప	టీ.ఎస్.ఓ.పి	150 గ్రాములు
వేరుశనగ	మాంకోజెబ్	3 గ్రాములు
వేరుశనగ (వురు పురుగుకు)	క్లోరోఫైరిఫాస్	6 గ్రాములు

ప్రయోజనాలు

విత్తనాలను విత్తిన తర్వాత నేల ద్వారా వ్యాప్తిచెందే తెగుళ్లు, పురుగులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దోహదపడుతుంది. శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకుపోయి శిలీంద్ర బీజాలను నాశనం చేస్తాయి. పప్పు జాతి పంట మొక్కల వేర్లపై, వేరుబడిపెల సంఖ్య పెరుగుతుంది. విత్తనశుద్ధి చేసిన తరువాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలోని శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయి. తక్కువ ఖర్చుతో పంటకు తెగుళ్లు, పురుగులు ఆశించకుండా చేయవచ్చు.

శుద్ధి పద్ధతులు

ఒక కిలో విత్తనానికి గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. ద్రవ రూపంలో, పొడి రూపంలో మందును విత్తనాలకు పట్టించాలి. అదేవిధంగా ప్రత్యేకమైన జిగురు వినియోగిస్తారు.

జాగ్రత్తలు

విత్తనశుద్ధికి వాడే మందులను తగిన మోతాదులోనే వాడాలి. మోతాదు మించితే విత్తనం మొలకరాదు. విత్తనాన్ని శిలీంద్రనాశిని, పురుగు మందుల వంటి వాటితో విత్తనశుద్ధి చేసిన తరువాతనే జీవ రసాయనాలతో శుద్ధి చేయాలి. విత్తనశుద్ధి సమయంలో గింజ పగలకుండా, విత్తనం పొట్టుపోకుండా జాగ్రత్తపడాలి. శుద్ధి సమయంలో చేతికి గ్లౌజ్‌లు వేసుకొని మూతికి గుడ్డ కట్టుకోవాలి.

ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


సమీక్షలో పాల్గొన్న శ్రీమఠం అధికారులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ముందస్తు సమీక్ష నిర్వహించారు. సోమవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మేనేజర్లు వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఆరాధనోత్సవాల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఆయా ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో మేనేజర్-1 ఎస్కే శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, ధార్మిక మేనేజర్ శ్రీపతి ఆచార్ చర్చలో పాల్గొని సభ్యుల సూచనలు నమోదు చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎమ్మిగనూరుటౌన్: మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆయన నివాసంలో పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి పూల బొకేలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతగా సేవలందిస్తా

ఆదోని అర్బన్: రాజకీయాలకు, మతాలకు అతీతంగా సేవ చేయడమే తమ ప్రధాన కర్తవ్యమని, క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఆదోని క్రైస్తవ ఐక్య సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముందుగా చర్చిలో ఫాస్టర్, క్రైస్తవులతో పాటు ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీలో ఒక కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. క్రైస్తవ కమ్యూనిటీ హాల్, పాస్టర్స్ కాలనీ, పాస్టర్లకు గౌరవ వేతనం, శ్మశాన వాటికకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతి పత్రం అందించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. పాస్టర్ల సంఘం అధ్యక్షుడు ఆనందరాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి

స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. కేకును కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యులు మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంతో ప్రతిభ కలిగిన డాక్టర్లు ఉన్నారని, తమ బాధ్యతను మరువకుండా ప్రజలకు సేవలందించి వైద్య వ్యవస్థలో మార్పు తీసుకురావాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను పెంచాలని, అందుకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వంతో చర్చిస్తానని చెప్పారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, వైద్యులు పద్మకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, ఎమ్మెల్యే, డీఎస్పీ, అధికారులు

ఆదోనిరూరల్: డయేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్‌ను సోమవారం ఇన్‌చార్జి డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతిసారా వ్యాధి లక్షణాలను వివరించారు. తిన్న ప్రతీది వాంతులు కావడం, విపరీతమైన విరేచనాలు, జ్వరం, నీరసంగా ఉండడం, మూర్ఛ వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధిని నివారించేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సబ్బుతో తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, డీఎస్పీ శివనారాయణస్వామి, వైద్యులు షహనాజ్, గాయత్రి, అనిల్, సూపర్‌వైజర్‌లు జ్ఞానేశ్వరి, మేరీ పాల్గొన్నారు.

'పార్టీ మారను.. వదంతులు నమ్మొద్దు'


మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆరు నూరైనా.. నూరు ఆరైనా తాను ఎన్నటికీ వైఎస్సార్‌సీపీని వీడేది లేదని పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు పనిగట్టుకుని తాను పార్టీని వీడనున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వదంతులను నమ్మవద్దన్నారు. సోమవారం ద్వారక ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 3వ తేదీన ఆదోని మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ల సమావేశం జరగనుందని, ఆ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని ఆహ్వానించేందుకు వెళ్లానని, అంత మాత్రాన పార్టీని వీడుతున్నట్లు ప్రచారం చేయడం ఎంతవరకు సబబన్నారు. ప్రాణం ఉన్నంత వరకు తాను వైఎస్సార్‌సీపీని వీడేది లేదని చెప్పారు. 2003లో కాంగ్రెస్ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాయని, నాటి నుంచి నేటి వరకు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సహాయ సహకారాలతో అంచలంచెలుగా ఎదగడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో కలిసి తన ప్రయాణం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 25 యేళ్లుగా సాయిన్న వెంటే నడుస్తున్నానని చెప్పారు. కొంతమంది కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ముఖ్యం కాదని, కార్యకర్తలే తనకు ప్రధానమని చెప్పారు. ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజమే


మాట్లాడుతున్న ఈఈ మద్దన్న

ఆదోని టౌన్: ఉద్యోగంలో చేరిన ప్రతిఒక్కరికీ పదవీ విరమణ సహజమేనని ఆదోని పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.మద్దన్న తెలిపారు. సోమవారం స్థానిక ద్వారకా ఫంక్షన్ హాల్‌లో కర్నూలు పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం, ఈఈ వెంకటప్రసాద్, ఏఈ యుగంధర్‌రెడ్డి పదవీ విరమణ గావించారు. ఈ సందర్భంగా ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పదవీవిరమణ చేసిన ఎస్‌ఈ, ఈఈ, ఏఈలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈఈ మద్దన్న మాట్లాడుతూ.. ఉద్యోగ కాలంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందడమే ఉద్యోగుల లక్ష్యమన్నారు. రిటైర్మెంట్ అనంతరం జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతపురం ఎస్‌ఈ వీరస్వామి, కర్నూలు పీఆర్ ఈఈ రామకృష్ణారెడ్డి, డ్వామా ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు అశ్వత్థామ, రంగస్వామి, శ్రీరాములు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, మహాదేవప్ప, డివిజన్ పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


డాక్టర్ మయూర్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్ట్స్ కళాశాల సిబ్బంది

ఆదోని సెంట్రల్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని డాక్టర్ మయూర్ కుమార్ జిందె సూచించారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ డాక్టర్ల దినోత్సవంను ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని ఆర్‌కేడీ పాఠశాలలో చదువుకున్న తాను కృషి పట్టుదలతో ఉన్నత చదువులు చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ప్రతి విద్యార్థికి ఓర్పు, శ్రమ, పట్టుదల, నిబద్ధత చాలా అవసరమన్నారు. అవి లేనప్పుడు ఎంత ప్రయత్నించిన ముందుకు వెళ్లలేరని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలంటే ఆటలు ఎంత అవసరమో చదువు కూడా అంతే అవసరమని గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల సిబ్బంది డాక్టర్ మయూర్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి యుగంధర్ రెడ్డి, నళిని, రంగనాథం, నేత్రావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అని చెప్పి.. ఒక్క చోటికి చేర్చి


ఎమ్మిగనూరులో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బి.జయనాగేశ్వర రెడ్డి


విక్టోరియా పేటలో పింఛను సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి


హనుమాపురంలో వృద్ధులను ఈశ్వర స్వామి ఆలయం వద్దకు రప్పించి పింఛన్ అందిస్తున్న దృశ్యం


కోసిగిలో పింఛన్ కోసం తండ్రిని బైక్‌పై కార్యాలయానికి తీసుకొచ్చిన కుమారుడు


కోసిగి పంచాయతీ కార్యాలయంలో పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు

ఎమ్మిగనూరు/ఆదోని టౌన్/గోనెగండ్ల/నందవరం/కోసిగి/కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులతో చేపట్టిన పింఛన్ల పంపిణీ ప్రక్రియలో గందరగోళం నెలకొంది. లబ్ధిదారులను ఉద్యోగులతో మ్యాపింగ్ చేసి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులు ఉండడంతో వారి ఇళ్ల అడ్రస్ కనుక్కుని వెళ్లేందుకు ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. వార్డుల్లో, సందుల్లో, గ్రామాల్లో ఇరుగుపొరుగువారిని అడిగి అడ్రస్ తెలుసుకొని వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో లబ్ధిదారులను ఒక చోటికి రప్పించి ఆలయాల ఆవరణం, చెట్ల కింద పింఛన్లు పంపిణీ చేయడం కనిపించింది. దీంతో లబ్ధిదారులు అవస్థలు పడుతూ వెళ్లి సొమ్ము తీసుకున్నారు. సర్వర్ సమస్య తలెత్తడంతో లబ్ధిదారులు వేచి చూడక తప్పలేదు. అధికారులతో పాటు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ శ్రేణులు పింఛన్ల పంపిణీలో పాల్గొనగా పలుచోట్ల వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. తామంటే తామే పింఛన్లు పంపిణీ చేయాలంటూ టీడీపీ శ్రేణులు బాహాబాహీకి దిగారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు అందుకుంటున్న వారికి మాత్రం ఏప్రిల్ నుంచి రూ.4 వేల పింఛన్‌ను వర్తింపజేస్తూ బకాయిలు రూ.3 వేలు కలుపుకుని రూ.7 వేల సొమ్ము అందించగా మిగతా పింఛనుదారులకు మాత్రం కేవలం పెంచిన సొమ్ము మాత్రమే అందజేశారు. దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎలాంటి బకాయిలు ఇవ్వకుండా పింఛన్ సొమ్ము రూ.6 వేలు మాత్రమే ఇవ్వడమే సీఎం చంద్రబాబు మొదటి సంతకంతోనే మోసం చేశారని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

- ఆదోని పట్టణంలోని 42 వార్డుల పరిధిలో 17,160 మంది లబ్ధిదారులకు సోమవారం పింఛన్లను పంపిణీకి శ్రీకారం చుట్టగా తొలిరోజు 87 శాతం మేర పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మిగతా 13 శాతం మందికి మంగళవారం పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విక్టోరియాపేటలో పింఛన్లను పంపిణీ చేశారు.
- గుడేకల్ గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి స్థానిక అధికారులతో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.
- గోనెగండ్ల మండలంలో మొదటి రోజు 85 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు.
- నందవరం మండల కేంద్రంలో ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 5929 మందికిగాను మొదటిరోజు 83 శాతం పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

పెద్దకడబూరు: పింఛన్ సొమ్ము ఇంటివద్దకే తెచ్చిస్తారని ఎదురుచూస్తున్న అవ్వతాతలకు టీడీపీ నాయకులు షాక్ ఇచ్చారు. అందరూ ఒకచోటికి రావాలని చెప్పడంతో చేతికర్రల సాయంతో అష్టకష్టాలు పడుతూ అక్కడికి వెళ్లి వేచిఉంచి సొమ్ము అందుకున్నారు. హనుమాపురం గ్రామంలో ఈశ్వర స్వామి ఆలయం వద్ద స్టేజ్ వేసి మరీ టీడీపీ నాయకులతో కలిసి ఎంపీటీసీ సభ్యురాలు శశిరేఖ పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. పింఛన్‌దారులు, టీడీపీ శ్రేణులతో ఆలయ ప్రాంగణం నిండిపోగా సోమవారం ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. అలాగే రంగాపురం గ్రామంలో అందరినీ మారెమ్మ గుడి వద్దకు పిలిపించి పింఛన్ల పంపిణీ చేపట్టారు. దీంతో అవ్వాతాతలు గతంలో ఇంటి వద్దకే వచ్చి సొమ్ము ఇచ్చేవారని, ఇప్పుడు ఇదేంటని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ శ్రేణుల బాహాబాహీ


కోసిగిలో వాగ్వాదం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కోసిగి: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ శ్రేణుల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. సోమవారం ఉదయం కడపాశెం ఎస్సీ కాలనీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి వర్గీయులు సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి పింఛన్లు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. అక్కడ ఉన్న టీడీపీ నియోజకవర్గ నాయకుడు రాఘవేంద్ర రెడ్డి వర్గీయులు వారికి అడ్డుపడడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం ఏర్పడి ఘర్షణకు దారి తీసింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం తిక్కారెడ్డి వర్గీయులు విలేకరుల సమావేశం నిర్వహించి.. రాఘవేంద్ర వర్గీయులు సీఎం చంద్రబాబు ఫొటోను పగలగొట్టి పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారని ఆరోపించారు. అందరినీ కలుపుకుని పోవాల్సింది పోయి ప్రభుత్వ పథకాల పంపిణీకి అడ్డుపడి గొడవలను ప్రోత్సహించడం ఏమిటని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు. విలేకరుల సమావేశంలో ఆ వర్గం నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

ఆయా మండలాల నుంచి వచ్చిన వినతుల్లో కొన్ని...

- ఆదోని మండలం ఆరేకల్ గ్రామానికి చెందిన వీరేష్ తనకు సొంతమైన సర్వే నంబర్ 89లో 4.50 ఎకరాల భూమిలో 4.50 సెంట్ల స్థలంలో పదేళ్ల క్రితం ఇంటిని నిర్మించుకున్నామని. ప్రస్తుతం ఇంటి సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని రోడ్డు మార్గం లేకుండా చేశారని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు.
- హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో సర్వే నంబర్ 354/ఏలో ఒక ఎకరం భూమి కొనుగోలు ద్వారా సంక్రమించింది. మా తండ్రి చనిపోయిన తర్వాత భూమిని తన పేరిట రిజిస్టర్ చేయడానికి వెళ్లగా ఆన్‌లైన్‌లో ఆ భూమి దేవదాయ శాఖకు చెందినదిగా చూపుతోందని, విచారణ చేపట్టి పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన రంగయ్య సర్వే నంబర్ 583లో తనకు 2.05 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట నమోదై ఉందని, విచారణ చేపట్టి భూమిని తన పేరిట నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలో అయ్యప్పకు సర్వే నంబర్ 147లో 2.40 ఎకరాల భూమి పెద్దల నుంచి వచ్చిందని, ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, దయచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో 49 మంది అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ డిప్యూటీ కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. గడువులోగా వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆయన ఆదేశించారు.

కార్యాలయపు పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ నూర్జహాన్, గృహ నిర్మాణశాఖ డీఈ రవికుమార్, ఆర్టీ నాగేంద్ర, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, సీడీపీఓ ఉమామహేశ్వరి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

చట్టాల మార్పుతో సత్వర సేవలు

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు బ్రిటీష్ కాలం నాటి చట్టాలలో మార్పులు చేసిందని దీంతో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు వీలవుతుందని ఎస్‌ఐ రమేష్ బాబు అన్నారు. సోమవారం రాత్రి మారిన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు.